## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజాం సిటీ: మండలంలోని గురవాం ఫీడర్ పరిధిలోని గ్రామాలకు ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్ శాఖ రూరల్ ఏఈ వావిలపల్లి సురేష్‌కుమార్ ఓ ప్రకటనలో శనివారం వెల్లడించారు. గురవాంతో పాటు రేగిడి మండలంలోని బాలకవివలస, మునకలవలస గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

### పిరిడిలో జూనియర్ కళాశాల ప్రారంభం


జూనియర్ కళాశాలను ప్రారంభిస్తున్న డిప్యూటీ ఈవో మోహన్‌రావు

బొబ్బిలి: హైస్కూల్ ప్లస్ పేరిట మండలంలోని పిరిడి గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొత్తగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాలను డిప్యూటీ ఈవో మోహన్‌రావు శుక్రవారం ప్రారంభించారు. అనంతరం అదే కళాశాలలో చేరిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ఆయన సమావేశమై, పలు సూచనలు చేశారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కళాశాల విద్యను దగ్గర చేయాలన్న ప్రభుత్వ ఆలోచన అభినందనీయమన్నారు. పిల్లలు వ్యయప్రయాసలకు గురికాకూడదన్న సదుద్దేశ్యంతో కొన్నిచోట్ల పాఠశాలలకు అనుబంధంగా ఈ ఏడాది నుంచి ప్రారంభిస్తున్న కళాశాలల్లో ఇంటర్మీడియట్ తరగతులు నిర్వహించడం జరుగుతోందన్నారు. గ్రామీణ విద్యార్థులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### రిజిస్ట్రేషన్ తప్పనిసరి


విత్తనాల రిజిస్ట్రేషన్‌ను పరిశీలిస్తున్న ఏవో మురళీకృష్ణ

రేగిడి: ఖరీఫ్ సాగుకు సంబంధించి, విత్తనాల కోసం రైతులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏవో జి.మురళీకృష్ణ సూచించారు. మండలంలోని లక్ష్మీపురం, రేగిడి, నాయిరాలవలస రైతు భరోసా కేంద్రాల వద్ద విత్తనాలు కావాలనుకునే రైతుల పేర్లు నమోదు చేసే ప్రక్రియ శనివారం చేపట్టారు. పంటల వివరాలు నమోదు చేస్తేనే విత్తనాలు సకాలంలో వస్తాయని, రైతులు తప్పనిసరిగా తాము వేసే పంటలను తెలియజేయాలని ఏవో కోరారు. ఎంటీయూ–1121, ఎంటీయూ–7029 రకాల వరి విత్తనాలు కావాలనుకునే వారు ప్రస్తుతం రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

### పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ


చాటాయివలసలో విత్తనాలు అందిస్తున్న ఏవో మురళీకృష్ణ

రేగిడి: మండలంలోని చాటాయివలస, రేగిడి, లక్ష్మీపురం గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల వద్ద రైతులకు శనివారం పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేశారు. ఏవో జి.మురళీకృష్ణ మాట్లాడుతూ 50 శాతం రాయితీపై అందిస్తున్న కట్టెజనుము, జీలుగు, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట విత్తనాలను అందిస్తున్నామన్నారు. వీటిని పొలంలో వేసుకుని మొక్కలైన తర్వాత కలియదున్నితే నేల సారవంతమై, పంటకు అవసరమైన పోషకాలు నేల ద్వారా అందుతున్నాయన్నారు.

### మలేరియా రహిత సమాజమే లక్ష్యం


వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

జామి: మలేరియా రహిత సమాజమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషిచేయాలని డీఎంహెచ్‌ఓ భాస్కరరావు పిలుపునిచ్చారు. మలేరియా నివారణ మాసోత్సవాల సందర్భంగా స్థానిక పీహెచ్‌సీ వైద్యసిబ్బందితో కలిసి మండల కేంద్రంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నివాస ప్రాంతాల మధ్య మురుగునీరు నిలువలేకుండా చూసుకోవాలని, దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. వారానికి ఒకరోజు డ్రైడే పాటించాలన్నారు. మలేరియా ప్రభావిత పీహెచ్‌సీలు కొట్టాం, పి.ఎం.పాలెం, మెంటాడ ప్రాంతాల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయనున్నట్లు తెలిపారు. జిల్లా మలేరియా అధికారి వై.మణి, జామి పీహెచ్‌సీ వైద్యాధికారి ఆర్.సామ్రాజ్యలక్ష్మి, ఎపిడిమియాలజిస్ట్ వెంకటేష్, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్.అనిల్‌ప్రేమ్‌కుమార్, సీహెచ్‌ఓ ఫ్లారెన్స్, హెచ్.వి.భవానీ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా హనుమాన్ జయంతి


బొబ్బిలి: పక్కి గ్రామంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

వాడవాడలా హనుమాన్ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. భక్తుల జై.. భజరంగ్, జై.. హనుమాన్ నినాదాలతో ప్రధాన వీధులు, ఆలయ ప్రాంగణాలు హోరెత్తాయి. వేకువజాము నుంచే మందిరాలకు చేరుకున్న భక్తులు అంజనీసుతుడైన ఆంజనేయునికి విశేష పూజలు చేశారు. ఉపవాసం ఆచరిస్తూ హనుమాన్ చాలీసా పఠించారు. ఇదేరోజున మారుతిని ఆరాధిస్తే సకల దోషాలు, భయాలు తొలగి, చేపట్టిన కార్యం దిగ్విజయంగా పూర్తవుతుందన్నది భక్తుల ప్రగాఢ విశ్వాసం. కొన్నిచోట్ల ర్యాలీలు, అన్నదానం చేసి స్వామిపై తమకున్న భక్తిభావం ప్రదర్శించారు. – సాక్షి నెట్‌వర్క్.


రాజాంలోని అమ్మవారి కాలనీలో ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ పూజలు


రామభద్రపురం: తారాపురం ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


సంతకవిటి: గుళ్లసీతారాంపురంలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు


తెర్లాం: సుందరాడలో పూజల్లో పాల్గొన్న భక్తులు


బాడంగి: భీమవరం అభయాంజనేయస్వామి ఆలయంలో భక్తుల పూజలు


రేగిడి: ఆమదాలవలసలో పూజలందుకున్న ఆంజనేయస్వామి


వంగర: నీలాయవలసలో పూజలు చేస్తున్న భక్తులు


బొబ్బిలి: బొబ్బిలిలో హనుమాన్ భక్తుల ర్యాలీ


రామభద్రపురంలో హనుమాన్ ఆలయంలో భక్తుల పూజలు

# అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు


విజయరాంపురం గ్రామస్తులకు సూచనలిస్తున్న బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు

తెర్లాం: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు, ఫలితాల నేపథ్యంలో గ్రామాల్లో ఎటువంటి అల్లర్లకు పాల్పడినా సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు హెచ్చరించారు. శనివారం మండలంలోని విజయరాంపురంలో తెర్లాం ఎస్‌ఐ ఆర్.రమేష్ ఆధ్వర్యంలో సార్వత్రిక ఎన్నికల నిబంధనలు, ఎన్నికల ఫలితాల రోజున వ్యవహరించాల్సిన తీరుపై అవగాహన కల్పించారు. అన్ని పార్టీల వారు సంయమనం పాటించాలని, ఏ పార్టీ గెలిచినా ఒకటిగానే వ్యవహరించాలని తెలిపారు. గెలిచిన పార్టీ వారు ఓడిన పార్టీ వారిని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా, గొడవలకు దిగినా కేసులు నమోదు చేస్తామన్నారు. జూన్ 4వ తేదీన వెలువడే ఎన్నికల ఫలితాలపై బెట్టింగ్‌లు వేయవద్దన్నారు. అన్ని గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా చూడాలన్నారు. అలాగే ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి, రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రమేష్, సర్పంచ్ మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

### యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

రేగిడి: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని హైకోర్టు న్యాయవాది మామిడి వేణుగోపాలనాయుడు అన్నారు. స్థానిక విశ్వసాయి మందిరంలో విద్యార్థులకు ఉచితంగా ధ్యాన యోగా తరగతులు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధ్యానం చేయడం ద్వారా మానసిక ప్రశాంతత కలగడంతో పాటు జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. నిత్యం యోగా, ధ్యానం చేయడం ద్వారా ఆయుష్షును, ఆరోగ్యాన్ని పెంచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సత్యసాయి భజన మండలి కన్వీనర్ మామిడి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### ఎస్‌ఎఫ్‌ఐ ఆందోళన



ఆందోళన చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నేతలు

బొబ్బిలి: పట్టణంలోని ఫ్లైఓవర్ దగ్గరున్న చైతన్య జూనియర్ కళాశాల భవనం వద్ద ఎస్‌ఎఫ్‌ఐ(స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) నేతలు శనివారం ఆందోళనకు దిగారు. భవన నిర్మాణం పూర్తికాకుండా అడ్మిషన్లు చేపట్టడ సరికాదని ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి కె.మణికుమార్ ఖండించారు. ఇక్కడి చైతన్య స్కూల్ భవనంలోనే ఇంటర్మీడియట్ తరగతులు ఎలా నిర్వహిస్తారని, ఇది నిబంధనలకు విరుద్ధమని ప్రశ్నించారు. దీనిపై విద్యాశాఖాధికారులు స్పందించి, తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# కంప్యూటర్ విద్యపై అవగాహన

బాడంగి: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం తరగతులకు హాజరైన విద్యార్థులకు కంప్యూటర్ విద్యపై అవగాహన కల్పించారు. ప్రస్తుత ప్రభుత్వం ఎనిమిదో తరగతి విద్యార్థుల చదువుకు ట్యాబ్‌లు అందిస్తున్న నేపథ్యంలో ఇప్పుడు నేర్పిస్తున్న కంప్యూటర్ తరగతులు ఉపకరిస్తాయని లైబ్రేరియన్ దుర్గాప్రసాద్ తెలిపారు. ప్రతీ విద్యార్థి కంప్యూటర్ నేర్చుకోవాలని సూచించారు.


కంప్యూటర్ విద్యపై అవగాహన కల్పిస్తున్న లైబ్రేరియన్ దుర్గాప్రసాద్

### జోరుగా ‘ఉపాధి’ పనులు

రేగిడి: మండలంలోని ఖండ్యాం, వెంకటాపురం, కొమిర, వన్నలి గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులు జోరుగా జరుగుతున్నాయి. రైతుల పంట పొలాలకు సక్రమంగా సాగునీరు అందేలా కాలువల్లో పనులు చేపడుతున్నారు. ఈ పనులతో రైతులు కూడా ఆనందం వ్యక్తం చేస్తుండడం గమనార్హం.


ఖండ్యాంలో సాగునీటి కాలువల్లో ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులు

### సీసీ రోడ్ల పరిశీలన

బొండపల్లి: ముద్దూరు పంచాయతీ పరిధిలోని తమటాడ గ్రామంలో నిర్మించిన సిమెంట్ రోడ్లను ఎంపీడీఓ ఎస్.హరిహరరావు, పంచాయతీరాజ్ జేఈఈ కె.కృష్ణమూర్తి శనివారం పరిశీలించారు. మండల పరిషత్, గడపగడపకూ మన ప్రభుత్వంతో పాటు,పంచాయతీ నిధులతో ఈ రోడ్లు నిర్మించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించారా లేదా అని పరీక్షించారు.

### యోగాసనాలపై శిక్షణ


యోగాసనాలపై శిక్షణ ఇస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు యోగాసనాలపై శనివారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి యోగాసనాలు వాటి ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. యోగా చేయడం ద్వారా ఏకాగ్రత, జ్ఞాపకశక్తి బాగా పెరగడంతో పాటు మంచి ఆరోగ్యం కూడా లభిస్తుందన్నారు. కార్యక్రమంలో క్రాఫ్ట్ ఉపాధ్యాయుడు విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# సాదాసీదాగా మండల సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సులోచన

రాజాం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లావేటి సులోచన అధ్యక్షతన మండల సర్వసభ్య సాధారణ సమావేశం శనివారం సాదాసీదాగా జరిగింది. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కారణంగా ఏ అంశాలపైనా లోతుగా, క్షుణ్ణంగా చర్చ జరగలేదు. అయితే ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో మండలంలో వరి విత్తనాల పంపిణీకి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎంపీపీ సూచించారు. కంచరాంలో నెలకొంటున్న విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని సర్పంచ్ అప్పలనాయుడు అధికారులను కోరారు. తోటపల్లి కాలువ ద్వారా ఖరీఫ్ సాగుకు సరిపడేలా సాగునీటిని అందించేలా ప్రణాళికలు రూపొందించాలని మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కోనారి అప్పారావు అధికారులకు సూచించారు. రైతుల పంట పొలాలకు సంబంధించి, 1–బిలు రావడం లేదని, ఆ సమస్యను పరిష్కరించి, బ్యాంకు రుణాల రీషెడ్యూల్‌కు ఇబ్బందులు లేకుండా చూడాలని రెవెన్యూ అధికారులను వైస్ ఎంపీపీ యాలాల సునీత తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో వావిలపల్లి శ్రీనివాసరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీనివాస్ సేవలు అభినందనీయం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్

రాజాం సిటీ: అనాథలైన వృద్ధులను అక్కున చేర్చుకుని, ఆదరించడంలో శ్రీనివాస్ సేవలు అభినందనీయమని వైఎస్సార్ సీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ అన్నారు. స్థానిక మున్సిపాలిటీ పరిధిలో కొండపేట వద్ద కొత్తగా నిర్మించిన అనాథ వృద్ధాశ్రమ శాశ్వత భవనాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆశ్రమాల నిర్వహణ అంత సులభం కాదని, ఓపిక, సహనం, అంకితభావం ఉండాలని, అవన్నీ శ్రీనివాస్‌లో పుష్కలంగా ఉన్నాయని ప్రశంసించారు. అనంతరం ఆశ్రమ నిర్వాహకులు శ్రీనివాస్ దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, మోనంగి ఆదినారాయణ, సలాది తులసీదాస్, కొత్తా అనంతరావు, రెడ్డి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అనుమతులు ఉన్నాయో లేదో పరిశీలించండి

బొబ్బిలి: పట్టణంలోని పలు ప్రాంతాల్లో నిర్మిస్తున్న బహుళ అంతస్తు భవనాలు, గృహ సముదాయాలు, పెద్దపెద్ద భవనాలకు సంబంధించి, అనుమతులు ఉన్నవీ లేనివీ తనిఖీలు చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఆదేశించారు. స్థానిక పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం పర్యటించిన ఆమె కొన్నిచోట్ల అనుమతులు లేకుండా భవన నిర్మాణాలు జరుగుతున్న విషయం తెలుసుకున్నారు. ఈ మేరకు ఆమె.. ఏయే భవన నిర్మాణాలకు అనుమతులు ఉన్నాయో తెలుసుకోవాలని టౌన్ ప్లానింగ్, సచివాలయ అధికారులకు సూచించారు. ఆమె వెంట టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ వరప్రసాద్ తదితరులు ఉన్నారు.


బొబ్బిలి పట్టణ మ్యాప్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

# పింఛన్ల పంపిణీ


తెర్లాంలో వృద్ధురాలికి పింఛన్ నగదు అందజేస్తున్న సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ హరిబాబు


రాజాం: పొగిరిలో ఇంటింటికీ వెళ్లి, పింఛన్లు అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

రామభద్రపురం/తెర్లాం/బాడంగి/రాజాం/రాజాం సిటీ: మండలాల్లోని అన్ని గ్రామాల్లో సామాజిక పింఛన్ల పంపిణీ శనివారం జరిగింది. ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో కొంతమంది లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా పింఛన్ నగదు జమ చేయగా, బ్యాంకు ఖాతాలు లేని మరి కొంతమంది వద్దకు సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులే నేరుగా వెళ్లి, బయోమెట్రిక్, ఫేష్ రీడింగ్, ఐరిష్‌ల ఆధారంగా పింఛన్ అందజేశారు.

# ఆక్రమణ అడ్డగింత..


ప్రొక్లెయినర్‌తో చదును చేస్తున్న దృశ్యం

బొబ్బిలి: పట్టణంలోని ఫ్లైఓవర్ పక్కన ఉన్న ఎకరన్నర కోనేరును ఓ ఆక్రమణదారుడు ఆక్రమించుకుని, జేసీబీతో చదునుచేస్తుండగా.. రెవెన్యూ అధికారులు శనివారం అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళితే.. ప్రభుత్వ చెరువును చదును చేస్తున్న విషయం తెలుసుకున్న వీఆర్‌ఓ శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకుని, ఆర్‌ఐ కల్యాణ చక్రవర్తికి సమాచారం అందించారు. దీంతో రెవెన్యూ అధికారులు వచ్చి జేసీబీని సీజ్ చేశారు. ఆక్రమణదారుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.